




# మనం
## నల్లగొండ
### సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

ఆదివారం | 18 | అక్టోబర్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com


### మహిళల సాంస్కృతిక వైభవానికి

# ప్రతీక బతుకమ్మ

### ఎస్పీ శరత్ చంద్ర పవార్

**జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు**

**నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్, ఆయన సతీమణి పూజా పవార్, పోలీస్ కుటుంబ సభ్యులు, మహిళా పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.**

నలగొండ-అక్టోబర్ 17( మనం ప్రతినిధి) : రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయబద్ధంగా ఆడిపాడుతూ పండుగ సందడిని నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య

- మిగతా 2లో..



# ఉదయం ఎండ..
# సాయంత్రం వాన!

## తిరుమలగిరి మార్కెట్‌లో అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం



**తిరుమలగిరి మార్కెట్ వచ్చిన రైతుల ధాన్యం తడిసి బుద్ధ అయింది. పగలంతా తీవ్రమైన ఎండ ఉక్కపోతతో ఉండి సాయంత్రం వేళ ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్మి అకాల వర్షం కురవడంతో మార్కెట్ లో పోసిన రైతుల కుప్పలు తడిసిపోయాయి. కొందరి రైతుల ధాన్యం కాంటాలు వేసి బస్తాలకు మరికొందరి అలాగే ఉండడంతో ధాన్యం తడిసి కొంత నీటికి కొట్టుకపోయింది.**

తిరుమలగిరి అక్టోబర్ 17 (మనం న్యూస్) : తిరుమలగిరి మార్కెట్ కు గత మూడు రోజులుగా అధిక ధాన్యం వస్తుంది. గురువారం అధికంగా1,50,561 బస్తాల ధాన్యం రావడంతో దానిని మార్కెట్ నుండి తరలించడానికి శుక్రవారం నాడు మార్కెట్ అధికారులు సెలవు ప్రకటించారు. శనివారం మార్కెట్ ఉ ఒడడంతో భారీగా రైతులు ధాన్యాన్ని మార్కెట్ కు 45 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకువచ్చారు. మార్కెట్ లో పోయడానికి సందు లేకుండా ధాన్యం పోటెత్తింది. వచ్చిన ధాన్యాన్ని వ్యాపారులు కొంత కాంటాలు వేయగా మరికొందరి రైతుల కుప్పలు అలాగే ఉ ఒడడంతో అకాల వర్షానికి తడిసిపోయాయి. కాంట వేసిన బస్తాలు కూడా తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని ఏలాంటి కోతలు విధించకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుచున్నారు.

## ఆర్టీసీ విచారణ కేంద్రాల
# నంబర్లు ఇవే..

### ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోష్ణ



నల్గొండ-అక్టోబర్ 17 (మనం న్యూస్) : ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నల్గొండ ప్రాంత పరిధిలోని బస్సు నిలయాల విచారణ కేంద్రాల ఫోన్ నంబర్లను ప్రాంతీయ నిర్వాహకురాలు టి. జ్యోత్స్న విడుదల చేశారు. బస్సుల సమయాలు, రాకపోకలు, ఇతర రవాణా సంస్థ సేవలకు సంబంధించిన సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత బస్సు నిలయ విచారణ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

**విభాగాల వారీగా విచారణ నంబర్లు**

**నల్గొండ విభాగం**

- నల్గొండ - 9490053652, - హాలియా - 9492610793, - చండూర్ - 9441008605, మునుగోడు - 7382834461

**సూర్యాపేట విభాగం**

- సూర్యాపేట కొత్త బస్సు నిలయం - 7382943819, - సూర్యాపేట ఆధునిక బస్సు నిలయం - 9494926625, - నకిరేకల్ - 9848589078

- మిగతా 2లో..

# మహిళల సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ

మొదటి పేజీ తరువాయి

జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఐక్యతను, ఆత్మీయతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని, కుటుంబ సభ్యులందరినీ ఒకచోట చేర్చి ఆనందాన్ని పంచుతుందని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, ప్రకృతిని పూజించడం మన తెలంగాణ సంప్రదాయంలోని విశిష్టత అని వివరించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తూ,



అనేక సందర్భాల్లో పండుగలు, కుటుంబ వేడుకలకు దూరంగా ఉండాల్సి వస్తుందని తెలిపారు. పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం ఎంతో విలువైనవని, వారి మద్దతుతోనే పోలీసులు మరింత అంకితభావంతో విధులు నిర్వహించగలుగుతున్నారని అన్నారు. పోలీసు కుటుంబ సభ్యులందరూ ఇలాంటి వేడుకల్లో కలిసిమెలిసి పాల్గొనడం ద్వారా పరస్పర ఆత్మీయత, ఐక్యత మరింత బలపడతాయని పేర్కొన్నారు. పండుగలు మన జీవితాల్లో సంతోషాన్ని నింపడమే కాకుండా, మన సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ పండుగ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాల్లో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, మహిళా ఎస్ఐలు శ్రావణి, అర్మీన్, మమత, సీఐ నాగరాజు, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, కళ్యాణ్ రాజ్, మహిళా సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలి

## వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ కె.సురేంద్రమోహన్

చౌటుప్పల్, అక్టోబర్ 17(మనం న్యూస్) : రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ కె.సురేంద్రమోహన్ సూచించారు. శనివారం చౌటుప్పల్ మండలంలోని ఆరేగూడెం గ్రామంలో వర్షపాత లోటు వల్ల వాడిపోయిన పత్తి పంటలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుసంఘాల(ఎఫ్‌పీఓ) ద్వారా పట్టు పరిశ్రమ, పంట ఉత్పత్తులను రైతులు స్వయంగా కొనడం అమ్మడం ద్వారా అధిక లాభాలు పొందాలని సూచించారు. వరి వేసే రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ పంట ద్వారా కూడా అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా పత్తి రైతులు వారి ఇబ్బందులను తెలియజేయగా పంట పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, ఉద్యానవ-నశాఖ అధికారి కె. హేమలత, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఉద్యాన అధికారి కవిత, వ్యవసాయ విస్తరణ అధికారి వెన్నెల, ఎన్నపల్లి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ నిమ్మల సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ విచారణ కేంద్రాల నంబర్లు ఇవే..

మొదటి పేజీ తరువాయి

**యాదాద్రి-భువనగిరి విభాగం**

- యాదగిరిగుట్ట - 6300479181, - భువనగిరి - 6300479181, - ఆలేరు - 7382836128, రామన్నపేట - 9640914489

**మిర్యాలగూడ విభాగం:** మిర్యాలగూడ - 9063159818,

**కోదాడ విభాగం**

- కోదాడ - 9959226302, - హుజూర్ నగర్ - 9959226302

**నార్కట్ పల్లి విభాగం**

- చౌటుప్పల్ - 7382834658, నార్కట్ పల్లి - 8309158944, చిట్యాల - 8008595647

**దేవరకొండ విభాగం**

- దేవరకొండ - 9490510752, మల్లేపల్లి - 9490510752, మాల్ - 6304986336 ప్రజలు బస్సుల సమయాలు, రాకపోకలు, ఇతర రవాణా సంస్థ సేవలకు సంబంధించిన వివరాల కోసం పై విచారణ నంబర్లను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆర్టీసీ నల్గొండ ప్రాంత ప్రాంతీయ నిర్వాహకురాలు టి. జ్యోత్స్న కోరారు.

# కొల్లాపూర్ చౌరస్తాలో ఆర్టీఏ సేవలు ప్రారంభం

## డీటీఓ ఇమ్రాన్ అహ్మద్

నాగర్ కర్నూల్, మనం న్యూస్ అక్టోబర్ 17) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద, కలెక్టరేట్ సమీపంలో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఏ సేవలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ అహ్మద్ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చేతుల మీదుగా ఇటీవల ప్రారంభమైన ఈ నూతన కార్యాలయం నుంచి ప్రజలకు సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు రవాణా సేవలను మరింత చేరువ చేయడం, వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రధాన ప్రాంతంలో ఉండటం వల్ల జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు కార్యాలయాన్ని చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. వాహనదారులు తమ వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర రవాణా శాఖ పనుల కోసం అవసరమైన పత్రాలతో నూతన కార్యాలయాన్ని సంప్రదించాలని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం

# గ్రామాభివృద్ధికి బాటలు.. ప్రజలకు చేరువగా పాలన!

**నారాయణపురంలో నూతన పంచాయతీ, మహిళా సంఘాల భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి**

**కన్నెకల్ చెరువుకు లిఫ్ట్ పనులు త్వరలో ప్రారంభం**

**దాచారం-గారకుంటపాలెం రహదారికి త్వరలో శంకుస్థాపన**

**మహిళలకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

మాడుగులపల్లి అక్టోబర్ 17 (మనం న్యూస్) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తెలిపారు. మాడుగులపల్లి మండలం నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనంతోపాటు మహిళా సంఘాల భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.



**మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం**

నూతన భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు స్థానిక పాలనాపరమైన సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. మహిళా సంఘాల భవనం స్వయం సహాయక సంఘాల సమావేశాలు, కార్యకలాపాలకు ఉపయోగపడటంతోపాటు మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

**రహదారి పనులకు త్వరలో శంకుస్థాపన**

గ్రామస్థులు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే.. దాచారం నుంచి గారకుంటపాలెం వరకు రహదారి నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. కన్నెకల్ చెరువును నింపేందుకు వరద కాలువ నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేసే పనులను రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆయా పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు, ముఖ్యంగా సాగునీటి అవసరాలున్న రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు.

**మహిళలకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన మహిళలకు ఎమ్మెల్యే కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శిరీష లింగారెడ్డి, ఉపసర్పంచ్ పద్మ సైదులు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వడ్డే సైదిరెడ్డి, ఎమ్మార్వో సరోజ పావని, ఎంపీడీవో వంశీధర్, డీటీ కత్తుల సైదులు, ఆర్ఐలు శ్యామ్, సత్యనారాయణ, ఏపీఎం మధుసూదన్, సర్పంచులు బెల్లి జానయ్య, కొత్త దశరథ, గనిపల్లి మోహన్, చింతరెడ్డి సైదిరెడ్డి, చింతరెడ్డి భాస్కర్ రెడ్డి, గజలాపురం ఉపసర్పంచ్ ఉగ్గిడి సత్యనారాయణ, కోమటి నాగరాజు, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి దేవి అలంకరణలో విజయ దుర్గాదేవి

**భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు**

**మహా అన్నప్రసాదం పంపిణీ**



నేరేడుచర్ల అక్టోబర్ 17 మనం న్యూస్ : శ్రీదేవి నవరాత్రి దసరా వేడుకలలో శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో శనివారం దర్శనమిచ్చారు. నేరేడుచర్ల పట్టణంలోగల శ్రీ విజయదుర్గ దేవి ఆలయం,శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో ఏడవ రోజు శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారికి ప్రీతిగా దీర్ఘ సుమంగల్యాభివృద్ధికి, సుహాసినిలచే వివాహ ప్రాప్తికి కన్యలకు అనుకూల వం- ప్రాతికి సామూహిక కుంకుమార్చనలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు భక్తులతో సందడిగామారాయి. ఆలయ అర్చకులు మొ లుగు శ్రీనివాసాచార్యులు, ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజ నిర్వహించారు. నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు..దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా,అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని కనులారా తిలకించారు. అనంతరం మహా అన్న ప్రసాదం పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కొనతం ఆదిరెడ్డి, కొనతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, స్థానిక ఎస్సై గోపాల్ రెడ్డి, నాగండ్ల శ్రీధర్, బొలిశెట్టి లక్ష్మయ్య, కొనతం కృష్ణారెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, సూరిబాబు, ఆకారపు వెంకటేశ్వర్లు, తాళ్ల సురేష్ రెడ్డి,గణేష్ రెడ్డి సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, మెడిసిన మెట్ల శివ, బెల్లంకొండ శేఖర్, కొనతం రామిరెడ్డి, కొనతం శ్రీనివాస్ రెడ్డి దంపతులు,వేమిరెడ్డి శంకర్ రెడ్డి,కొనతం లచ్చిరెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పట్టభద్రులు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలి




కోదాడ//నడిగూడెం, అక్టోబర్ 17(మనం న్యూస్) :ఉమ్మడి నల్లగొండ -ఖమ్మం - వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో భాగంగా నడిగూడెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండు మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు పగిళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులకు గ్రామంలోనే అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావడానికి ఓటర్ నమోదు ప్రక్రియ ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోసుల రాజేష్, ఉప సర్పంచి పుల్లయ్య, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శివరాత్రి ఉపేందర్, వార్డ్ మెంబెర్స్ ఉపేందర్, కరుణాచారి, మనోజ్, గ్రామ నాయకులు అర్జున్ రావు, గోవర్ధన్, గోపీనాథ్, ఫెరెల్లి గోపయ్య, మొక్క శ్రీను, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ గ్రామ కమిటీ,మండల కమిటీ, యువజన నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోపిరెడ్డి నగర్‌లో బతుకమ్మ ఆటపాట

**గోపిరెడ్డి నగర్‌లో ఏడో రోజు బతుకమ్మను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు**



కోదాడ, అక్టోబర్ 17(మనం న్యూస్): ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు కోదాడ పట్టణం గోపిరెడ్డి నగర్ లో ఘనంగా ఏర్పాటు చేశారు గోపిరెడ్డి నగర్ బతుకమ్మ కమిటీ నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు, మహిళా మండ లి అధ్యక్షురాలు నూనె సులోచన మాట్లాడుతూ. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజించడం తెలంగాణ ప్రత్యేకతని, బతుకమ్మ ఆటలు, పాటలు మహిళల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. 'మా ఇంటి ఇలవేల్పు గౌరమ్మ రావమ్మా' అంటూ బతుకమ్మ పాటలతో మహిళలు సంప్రదాయ వేడుకలకు శ్రీకారం చుట్టారు. తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ, ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ సుఖసంతోషాలు, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ తుమ్మల నాగేంద్రమ్మ , గంధం బాలేంద్ర పందు, వంగూరు గోపి, కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు ఎర్నేని నిర్మల మేదర లలిత తదితరులు పాల్గొన్నారు



# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**విద్యుత్ శాఖ రాష్ట్ర ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు**

**భట్టుగూడెం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం**

బీబీనగర్: అక్టోబర్17, (మనం న్యూస్) : రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ రాష్ట్ర ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రైతులతో నేరుగా మాట్లాడి, విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, అంతరాయాల గురించి ఆరా తీశారు. పంటలకు సకాలంలో నీరందించేందుకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఏవైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని, మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కందాడి సురేష్ కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ మచ్చేందర్, ఏఈ మనోహర్ రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, రియాఉద్దీన్, స్థానిక లైన్‌మెన్ నరేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ సేవలకు దక్కిన గౌరవం

నేరేడుచర్ల,అక్టోబర్ 17 మనం న్యూస్ : నల్లగొండలో నిర్వహించిన 320ఈ 2025-26 జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నేరేడుచర్లకు విశేష గుర్తింపు లభించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ క్లబ్ అవార్డు విభాగంలో అధ్యక్షులు కీతా కనకయ్య, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ విభాగంలో లయన్ బట్టు మధు, ఉత్తమ సెక్రటరీ విభాగంలో లయన్ షేక్ యూసుఫ్, ఉత్తమ ట్రెజరీ విభాగంలో లయన్ సరికొప్పుల నాగేశ్వరరావు గవర్నర్ లయన్ మదన్మోహన్ రేపాల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో , జీఎంటి కో-ఆర్డినేటర్ లాయర్ విశ్వనాథం పాల్గొన్నారు. ఈ అవార్డులు క్లబ్ సభ్యుల సేవా స్ఫూర్తికి, సమాజాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచాయి.

# పేదలకు నూతన వస్త్రాల పంపిణీ

కోదాడ, అక్టోబర్ 17(మనం న్యూస్): అంతర్జాతీయ పేదల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడ నయానగర్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో పేదలకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. మున్సిపాలిటీ మాజీ క్రిస్టియన్ కో-ఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకి యేసయ్య ఆధ్వర్యంలో కొంతమంది నిరుపేదలకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ వంతుగా పేదలకు సహాయం చేయాలని, పేదలను ఆదుకోవడమే నిజమైన దైవ సేవ అని పేర్కొన్నారు. పేదల పట్ల ప్రేమ, సహాయం చూపడం ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ నాయకులు పాస్టర్ యేసయ్య, పాస్టర్ కర్ల ప్రభుదాస్, డేవిడ్ రాజారావు, పాస్టర్ రాజారావు, పాస్టర్ కాపుగంటి ప్రసాదరావు, పాస్టర్ చెల్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# అన్నారంలో కనకదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

## భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, సరస్వతీ పూజ





తుంగతుర్తి :అక్టోబర్ 17,(మనం న్యూస్) : తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కుంకుమార్చన, సరస్వతీ పూజ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి, కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం విద్యకు అధిదేవత అయిన శ్రీ సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు, యువతీ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం మొత్తం భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. నవరాత్రి ఉత్సవాలు గ్రామ ప్రజలలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో భాగస్వాములై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారి కృపాకటాక్షాలు అన్నారం గ్రామ ప్రజలందరిపై ఉండి, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని" ఉత్సవ కమిటీ తెలియజేశారు.




# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

కోదాడ//నడిగూడెం, అక్టోబర్ 17(మనం న్యూస్): ఉమ్మడి నల్లగొండ – ఖమ్మం – వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో భాగంగా నడిగూడెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండు మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు పగిళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కాగిత రామచంద్రపురం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులకు గ్రామంలోనే అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావడానికి ఓటర్ నమోదు ప్రక్రియ ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి దోసపాటి రవి, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నలిని రెడ్డి, గ్రామ ఇందిరమ్మ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు గురవారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ, గోపి, అఖిల్, వర్షిత్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ గ్రామ కమిటీ,మండల కమిటీ, యువజన నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నడిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

## బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్




కోదాడ//నడిగూడెం, అక్టోబర్ 17(మనం న్యూస్): ఎల్ నినో ప్రభావంతో సరైన వర్షాలు కురవక, విద్యుత్ సమస్యలు, సాగునీటి కొరతతో పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు అల్లాడిపోతున్నారని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. నడిగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నడిగూడెం మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే, నేడు పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పంటలు ఎండిపోతున్నాయి.. రైతులు కన్నీరు పెడుతున్నారు.. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం లేదా? అని ప్రశ్నించారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకొని సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమైంది. కళ్లముందే నీళ్లు వృథాగా పోతుంటే.. మన రైతులు మాత్రం సాగునీటి కోసం అల్లాడాల్సిన దుస్థితి ఎందుకు? అని నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతోపాటు వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది.. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా రైతుల సమస్యలపై దృష్టి సారించి, నడిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బోనగిరి ఉపేందర్ కోరారు.

# రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గణేష్





సూర్యాపేట అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) : ఇటీవల సూర్యాపేట జిల్లాలోని హుజూర్నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ రచయితల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నాలుగు నియోజకవర్గాల కార్యవర్గాల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యవర్గ సభ్యులు కవులు రచయితలు కలిసి శనివారం సూర్యాపేట జిల్లా రచయితల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి రచయిత, సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోవడం అదేవిధంగా ప్రముఖ కవి పిల్లల మరి పినవీరభద్రం కళాపీఠం వ్యవస్థాపకులు శీలా అవిలేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు కవులు రచయితల సంఘం తెలిపింది. వీరితోపాటు జిల్లాలోని సీనియర్ రచయిత ఆలేటి శంకర్ ను సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా బెల్లంకొండ శ్రీరాములు, గడ్డం నర్సయ్య, తుమ్మరాజా లను నియమించారు. ఉపాధ్యక్షులుగా ధర్మూరి వెంకటేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి, ఎర్ర హరికిషన్, సంయుక్త కార్యదర్శులుగా గొడిశాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు, సరికొండ నరసింహారాజు ప్రచార కార్యదర్శిగా పబ్బతి వెంకటేశ్వర్లు,కార్యవర్గ సభ్యులుగా ముక్కామల జానకి రాములు, ఏబెల్ శశి, ఎన్ .సీ. రోజా, పూసోజు పద్మ, పోతుగంటి వీరాచారి, జిల్లేపల్లి జానయ్య, కొక్రపిడత శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, కొండా లింగారావు, ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ..సాహిత్య సాంస్కృతిక రంగంలో కవులు రచయితలను ఒక తాటిపై నడిపి సూర్యాపేట సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేస్తామని నూతన వర్తమాన కవులు రచయితలకు ప్రోత్సాహం ఇస్తూ వారి రచనలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. తెలుగు భాషను సుసంపన్నం చేసే దిశగా అనేక కార్యక్రమాలు తీసుకుంటామన్నారు. కవిత్వ కార్యశాలలతో పాటు, తెలుగు భాష విస్తృతికి ఉన్నతికి తెలుగు భాషా ఉపాధ్యాయులను కలిసి కృషి చేసేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు .పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన కవిత్వ, కథా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తామని సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఆ బాధ్యతను తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన అనేకమంది కవులు రచయితలు సాహితీప్రియులు పాల్గొన్నారు.

# ఘనంగా మహా అన్నదానం

### కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ

### ముదిరాజ్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహణ

**భారీగా తరలివచ్చిన భక్తులు**



అనంతగిరి అక్టోబర్ 17 (మనం న్యూస్): మండల పరిధిలోని వాయిల సింగవరం గ్రామంలో ముదిరాజ్ కాలనీ యువత ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహిస్తున్న సంప్రదాయంలో భాగంగా ఈ ఏడాది కూడా యువత ఐక్యంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ముందుగా కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గ్రామభక్తుల తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమంలో ముదిరాజ్ కాలనీ యువకులు స్వయంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటే ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని గ్రామ పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాజీ ఎంపీపీ చుందూరు వెంకటేశ్వరరావు ఉప సర్పంచ్ కంటూ రమాదేవి నాగేశ్వరావు, గద్దె రఘు, గద్దె రామారావు, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కంటూ నాగార్జున, కంటూ వేణు, చుందూరి మురళి, కంటూ శ్రీకాంత్, కొల్లు సుబ్బారావు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్

### చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి

త్రిపురారం అక్టోబర్ 17 మనం న్యూస్ : త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.51,05,916 విలువైన కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను స్థానిక శాసనస భ్యులు శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేసి,వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గాజుల ప్రమీల, ఆర్ఐ సంతోషి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆలంపల్లి జానయ్య,బుచ్చిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,రవి, చంద్రారెడ్డి, వెంకట్ రెడ్డి, భాస్కర్,సతీష్,రంగారెడ్డి,వీరయ్య,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అధికారులు,లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవఖాన తాళం కూడా తీయని సిబ్బంది



త్రిపురారం అక్టోబర్ 17 మనం న్యూస్ : త్రిపురారం మండలం మాటూరు గ్రామం పల్లె దావఖన వైద్య సిబ్బంది విధుల నిర్వహణ తీరు ఇష్టారాజ్యంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది సమన్వాయ పాలన పాటించకపో వడంతో పాటు వైద్య సేవలు సక్రమంగా అందించాలని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పల్లె దావఖన ప్రతిరోజు ఉదయం 9:00 నుండి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించడంతోపాటు సిబ్బంది అందుబా టులో ఉండాల్సి ఉంది. కానీ మాటూరు పల్లె దావఖన మాత్రం సమన్వాయ పాలన పాటించడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.వైద్య సిబ్బంది కోసం రోగులు గంటల తరబడి ఎదురు చూసి పరిస్థితి ఉంది ఇప్పటికైనా మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారి స్పందించి మాటూరు పల్లె వైద్య కేంద్రం పనితీరుపై విచారణ జరిపించాల్సి ఉంది.

## అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కావాలి

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యం కావాలి ఇస్లావత్ రాంచందర్ నాయక్

**సత్యం పహాడ్ తండాలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం**

త్రిపురారం అక్టోబర్ 17 మనం న్యూస్ : త్రిపురారం మండలం సత్యం పహాడ్ తండా గ్రామపంచాయతీలో ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ ఇస్లావత్ రాంచందర్ నాయక్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు.అనంతరం పార్టీ శ్రేణులకు, యువకులకు ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు జరిగేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు,ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, ఇతర అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారిని నేరుగా కలిసి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు పూర్తయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన పట్టభద్రులు దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామాలకు వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వారిని సంప్రదించి ఓటు నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని గుర్తించి ఓటు నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.



# వ్యాపారుల మాటలుకు రైతులు మోసపోవద్దు

### తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దు

### అతి త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం

**జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్ళెం రాఘవరెడ్డి**

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 (మనం న్యూస్) : రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్ళెం రాఘవరెడ్డి విజ్ఞప్తి చేశారు. పిల్లాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగ అనంతరం పీఏసీఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.ప్రస్తుతం కొందరు వ్యాపారులు క్వింటాల్ ధాన్యాన్ని రూ. 2,200కే కొనుగోలు చేస్తున్నారని, రైతులు తొందరపడి తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి నాణ్యతగా సిద్ధం చేసుకుని,



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించినా, అవసరమైతే గోదాములకు తరలించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తుఫాను వచ్చే అవకాశం ఉంటే రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు త్వరగా నిర్వహించి ధాన్యాన్ని సకాలంలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కళ్ళెం రాఘవరెడ్డి తెలిపారు.

# అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**తెలంగాణ రాష్ట్ర టూరిజం సంస్థ మాజి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

**లింగాల గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న పటేల్**



పెన్ పహాడ్ అక్టోబర్ 17 (మనం న్యూస్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు మండలంలోని లింగాల గ్రామంలో శ్రీ కనకదుర్గ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి విచ్చేసిన పటేల్ రమేష్ రెడ్డి స్థానిక సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించుకుని మాట్లాడారు దేవి నవరోత్రోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలిగి ఉండాలని రాష్ట్రంతో పాటు గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేసిరెడ్డి కోటిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, బంటు చొక్కయ్య గౌడ్, మండల నాయకులు యాట ఉపేందర్, కుందూరి వెంకటరెడ్డి, ముదిరెడ్డి రంగారెడ్డి ,ఎల్లారెడ్డి, గుర్రం అమృతారెడ్డి, రణబోలు శ్రీనివాస్ రెడ్డి,గాయం కరుణాకర్ రెడ్డి, దాసరి మట్టయ్య, మజ్జిగపు నర్సిరెడ్డి, కౌన్సిలర్లు పాలగాని కృష్ణ, వల్దాస్ దేవేందర్, మాలధారణ స్వాములు యడవెల్లి శ్రీధర్ రెడ్డి, బట్టుపల్లి సైదులు, కొన్నె ఆంజనేయులు, కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## రామ్ నగర్ అభ్యుదయ యూత్ నూతన కమిటీ

చౌటుప్పల్, అక్టోబర్ 17(మనం న్యూస్) : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని రామ్ నగర్‌లోని అభ్యుదయ యూత్ నూతనకమిటీని శనివారం ఆ కమిటీ గౌరవ సలహాదారులు చెరుకు అశోక్‌గౌడ్, వరకాల వెంకట్‌కుమార్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు తొర్పునూరి బాబుగౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం నూతనకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చెవగోని వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షునిగా మార్గం నర్సింహాయాదవ్, ప్రధానకార్యదర్శిగా తొర్పునూరి లింగస్వామిగౌడ్, కోశాధికారిగా వెంకటేష్‌గౌడ్, కార్యదర్శిగా తొర్పునూరి చిన్నమల్లేష్‌గౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా వరకాల జయరామ్, సలహాకార్యదర్శిగా చెవగోని రమేష్‌గౌడ్, ప్రచారకార్యదర్శిగా చెరుకు రాము, సాంస్కృతిక కార్యదర్శిగా తొర్పునూరి సాయిలు, బాలగోని రామ్‌ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా తొర్పునూరి వెంకటేష్, బెదరకోట వెంకటేష్, ఉప్పాగుల శ్రీశైలం, బందారం శివ, చెరుకు సాయి, మొగుదాల రమేష్, రాకేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చెవగోని వెంకటేష్‌గౌడ్ మాట్లాడారు. తన నియమకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తొర్పునూరి పెద్దమల్లేష్‌గౌడ్, బాలగోని నర్సింహాగౌడ్, తొర్పునూరి జంగయ్యగౌడ్, విశ్వరూపంచారి, చెవగోని మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతిరమేష్‌గౌడ్**



చౌటుప్పల్, అక్టోబర్ 17(మనం న్యూస్) : ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతిరమేష్ గౌడ్ తెలిపారు. శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 14వ వార్డులో చెత్తబుట్టల పంపిణీ, ఇంటికొక మొక్కను పంపిణీచేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మున్సిపల్ తరపున రెండు చెత్తబుట్టలను పంపిణీచేస్తున్నట్టు తెలిపారు. ఒక బుట్టలో తడి చెత్త, మరో బుట్టలో పొడి చెత్త వేసి మున్సిపాలిటీ వాహనానికి సహకరించాలని కోరారు. భవిష్యత్తు తరాలకు చక్కని వాతావరణాన్ని అందించాలంటే కేవలం చెట్లతోనే సాధ్యమన్నారు. ప్రతి ఇంటికి ఒక మొక్కను అందిస్తున్నామని, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ డైరెక్టర్ వరకాల రవిగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కామిశెట్టి చంద్రశేఖర్‌గుప్త, దొడ్డి గణేశ్, నందగిరి సాయిగౌడ్, మండలోజు మనోజ్‌చారి, వన సంరక్షణ అధికారి వేణు, శానిటరీ ఇన్స్ పెక్టర్ హనుమాన్ ప్రసాద్, వార్డు అధికారి కిరణ్, బిల్ కలెక్టర్ వెంకటేష్, జవాన్ నర్సింహా, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## 12వ వార్డు అభివృద్ధే లక్ష్యం



చౌటుప్పల్, అక్టోబర్ 17(మనం న్యూస్) : 12వ వార్డు అభివృద్ధే తన లక్ష్యమని ఆ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని విద్యానగర్ నుండి శాంతినగర్ రేషన్‌షాపు వరకు నిర్మిస్తున్న పెద్ద మోరి పనులను చిరంజీవి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావనిరమేష్‌గౌడ్ దృష్టికి పెద్ద మోరి సమస్యను తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మోరి నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. చైర్‌పర్సన్ పెద్ద మోరి నిర్మాణాన్ని చేపడ్తామని హామీ ఇచ్చి రెండు నెలల్లోనే పనులు ప్రారంభించడం పట్ల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కాలనీ ప్రజలు, కౌన్సిలర్ చైర్‌పర్సన్ పావనికి కృతజ్ఞతలు తెలిపారు.

# అమ్మవారికి ఘనంగా కుంకుమార్చన

**భక్తులకు అన్నదానం**

**భక్తుల కొంగుబంగారంగా కనకదుర్గ అమ్మవారు**

**యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులుడు అనంత చంద్రశేఖర్ గౌడ్**



చందూరు.. అక్టోబర్ 17: మనం న్యూస్ : చందూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట గ్రామంలో శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. మహిళా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ అసోసియేషన్ శరన్నవరాత్రి ఉత్సవ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్గౌడ్ మాట్లాడుతూ.. గత 8 సంవత్సరాలుగా అంగడిపేటలో అమ్మవారు కొలువై ఉండి భక్తుల కోర్కెలు తీరుస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రామస్థుల సహకారంతో కనుల పండుగగా, కమనీయంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి దర్శనానికి, ఇతరప్రాంతాల నుండి చేసే మహిళలకు,భక్తులకు, ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లుగా భక్తులు ఆహ్లాదకరమైన ఆధ్యాత్మికమైన వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునే అవకాశం కలిగిందని శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

## జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా వెంకట్ రామ్ రెడ్డి

నల్లగొండ- అక్టోబర్ 17( మనం ప్రతినిధి) : జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా పెద్ద సూరారం గ్రామానికి చెందిన ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోదరింగ్ కమిటీ సభ్యుడిగా నియామకం కావడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డిలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇబ్రహీం, ఆర్టీఏ సభ్యుడు కూసుకుంట్ల రాజారెడ్డి, ఏదుళ్ళ మధుసూదన్ రెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మోదరింగ్ కమిటీ సభ్యుడు పాదం అనిల్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్ రెడ్డి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.





## నవరాత్రి వేడుకల్లో భక్తిశ్రద్ధలతో అన్నదానం

మాడుగులపల్లి అక్టోబర్ 17 (మనం న్యూస్) : ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటుతూ మాడుగులపల్లి మండల పరిధి గజలాపురం గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తి భావంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఉగిడి సత్యనారాయణ, కమిటీ సభ్యులు నరేష్, సందీప్, సైదులు, విజేందర్, పి. నరేష్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బీబీనగర్ గౌడ్ బస్తీలో ఘనంగా బతుకమ్మ, దాండియా

బీబీనగర్: అక్టోబర్17 (మనం న్యూస్) : మండల కేంద్రంలోని గౌడ్ బస్తీలో గౌడ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ, దాండియా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం దాండియా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు మహిళల్లో ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ మహిళా సొసైటీ సభ్యులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను సందడిగా గడిపారు.

## పడమటి సోమారంలో భక్తులకు అన్నదానం

బీబీనగర్: అక్టోబర్17, (మనం న్యూస్) : మండల పరిధిలోని పడమటి సోమారం గ్రామంలో శ్రీ లింగబసవేశ్వర స్వామి దేవాలయం వద్ద ప్రతి శనివారం భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు సందిగారి బస్వయ్య చేతుల మీదుగా అన్నదాన ప్రసాదాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆల్వా రామకృష్ణారెడ్డి, ధర్మకర్త గండు రాజు యాదవ్, ఆలయ మాజీ చైర్మన్ ఆల్వా వీరారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆలేటి బలరాం రావు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన ప్రసాదం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



# జిల్లా పరిషత్ కార్యాలయంలో వైభవంగా బతుకమ్మ

### పూల పండుగ బతుకమ్మతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పట్టం

### మహిళా ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా వేడుకలు



నల్గొండ– అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) : జిల్లా ప్రజా పరిషత్ నల్గొండ కార్యాలయంలో తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం నల్గొండ శాఖ ఆధ్వర్యంలో జిల్లా శాఖ అధ్యక్షుడు కొప్పు రాంబాబు నేతృత్వంలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలు కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉద్యోగులందరూ ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మినిస్టీరియల్ మహిళా ఉద్యోగులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మను భక్తిశ్రద్ధలతో అలంకరించారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, బతుకమ్మ చుట్టూ ఆడిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. పూల సౌందర్యం, మహిళల కోలాటాలు, సంప్రదాయ గీతాలతో జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. మహిళా ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భం గా జిల్లా పరిషత్ సీఈఓ, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ఆచార వ్యవహారాలకు, ప్రకృతితో మమేకమైన మన సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతిలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఇలాంటి పండుగలను ఘనంగా నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పరస్పర స్నేహభావం, ఐకమత్యం, ఆత్మీయత పెంపొందుతాయని అన్నారు. మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమని పేర్కొంటూ, అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం నల్గొండ శాఖ అధ్యక్షుడు కొప్పు రాంబాబు మాట్లాడుతూ, ఉద్యోగులలో ఐక్యతను పెంపొందించడం తో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో బతుకమ్మ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగులందరూ కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఇలాంటి పండుగలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి అలివేలు మంగమ్మ, పర్యవేక్షకులు బసవోజు, శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్లు హరినాథ్, శోభ, జూనియర్ అసిస్టెంట్లు ఎండీ గులాం రబ్బాని, రేఖ, రేణుక, భాగ్యవతి, రజిత, విజయభాస్కర్, స్నేహ తదితరులతో పాటు కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, యాసీన్, అనిల్, అభిరామ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## దుర్గామాత పూజలో పాల్గొన్న గోలి ప్రణీతా పింగల్ రెడ్డి దంపతులు

బీబీనగర్: అక్టోబర్17, (మనం న్యూస్) : పట్టణంలోని శ్రీ తుల్జా భవాని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీబీనగర్ మండల మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి పెరబోయిన బస్వరాజ్ యాదవ్, బీబీనగర్ వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువజన సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నీనోపై మండల స్థాయి సమీక్ష

పెన్ పహాడ్ అక్టోబర్ 17(మనం న్యూస్):ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం వలన రానున్న రోజుల్లో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో జానయ్య సూచించారు ఆయన అధ్యక్షతన శనివారం వారి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఎల్నినో నేపథ్యంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు మోటార్లు లీకేజీలు లేకుండా చూసుకోవాలని, త్రాగునీరుకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు వి బి జి రాంజీ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరిగే విధంగా, ప్రతి ఒక్కరికి కూలి లభించే విధంగా కృషి చేయాలన్నారు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పించే విషయంలో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ బీసు రాజేశ్వర్,గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఏఈ జాన్ ఫ్రెడ్,పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.



# వివిధ గ్రామాల్లో కార్యకర్తలకు పటేల్ పరామర్శ

### రణపంగ సుశాంత్ కుటుంబానికి ఆర్థికసాయం



పెన్ పహాడ్ అక్టోబర్ 17 (మనం న్యూస్): మండలంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు లింగాల గ్రామంలోని దాచేపల్లి యాదగిరి ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాదులో శస్త్ర చికిత్స నిర్వహించగా వారి గృహానికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు అదేవిధంగా గ్రామానికి చెందిన రణపంగ సైదులు అనారోగ్యానికి గురై కాలుకు ఆపరేషన్ నిర్వహించుకోవడంతో స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా గ్రామానికి చెందిన ఏడవ వార్డు సభ్యులు రణపంగ విద్యాసాగర్, సోదరుడు రణపంగ చార్లెస్ కుమారుడు రణపంగ సుశాంత్ చిన్న వయసులోనే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబాన్ని ఓదార్చి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు మండలంలోని మాచారం ఆవాస గ్రామం అనిరెడ్డి గూడెం గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు ముదిరెడ్డి రంగారెడ్డి, ఎల్లారెడ్డి మాతృమూర్తి ముదిరెడ్డి జానకమ్మ అనారోగ్యానికి గురికాగా ఆమెను పరామర్శించి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో లింగాల సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, యాట ఉపేందర్, కుందూరి వెంకటరెడ్డి, బంటు చొక్కయ్య గౌడ్, గార్లపాటి శివారెడ్డి, రావిరాల వంశీ,గుర్రం అమృత రెడ్డి, గాయం కరుణాకర్ రెడ్డి, దాసరి మట్టయ్య, వల్దాస్ దేవేందర్, పోలగాని కృష్ణ, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద సూరారంలో న్యాయ చైతన్య సదస్సు

నల్గొండ–అక్టోబర్ 17( మనం న్యూస్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు పెద్ద సూరారం గ్రామపంచాయతీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. హిమబిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని వివరించారు. పేదలు, ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, వృద్ధులు తదితర అర్హులైన వర్గాల ప్రజలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు, మహిళల హక్కులు, బాలల రక్షణ, కార్మికుల హక్కులు వంటి అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత న్యాయ సేవా సంస్థలను సంప్రదించి తగిన సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి గుండె జానమ్మ, ఉపసర్పంచ్ పెండెం అరుణ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టీ. అనిల్ కుమార్, మహేష్, గోవర్ధనం, యాదయ్య, రాములు పారా లీగల్ వాలంటరీ భీమనపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లతో భరోసా

### గూడూరు సర్పంచ్ అలివేలు మంగ శ్రీనివాస్

### స్మార్ట్ రేషన్ కార్డులు, మూడు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



బీబీనగర్, అక్టోబర్ 17, (మనం న్యూస్) : పేద కుటుంబాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గూడూరు గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గూడూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు రాకపోవడంతో పాటు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు విషయంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేదలకు గుర్తింపునిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతోందన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జానా సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు తోరుపునూరి అశ్విని బాలరాజ్ గౌడ్, దంతూరి రాణి శ్రీనివాస్ గౌడ్, కసగోని అరుణ సత్యం గౌడ్, బింగి లావణ్య రమేష్, దొనకొండ శ్రీరాములు, బింగి సంజయ్, కాంగ్రెస్ నాయకులు గడ్డం బాల్ రెడ్డి, గూడూరు నిఖిల్ రెడ్డి, బద్దం వాసుదేవరెడ్డి, పాలకూరి శ్రీనివాస్ గౌడ్, కుశంగాల దశరథ, దొనకొండ శ్రీనివాస్, జేరిపోతుల బాలయ్య, ఈసారపు కృష్ణ గౌడ్, జీపీఓ సుజాత, గ్రామ కార్యదర్శి ఎండీ నజీర్, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పీహెచ్సీలో ఘనంగా బతుకమ్మ

### సాంప్రదాయ బద్ధంగా వేడుకలు నిర్వహించిన మహిళా సిబ్బంది

పెన్ పహాడ్ అక్టోబర్ 17 (మనం న్యూస్): మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బంది బతుకమ్మ వేడుకలను సంప్రదాయ బద్ధంగా శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రకరకాల పూలను సేకరించి అందంగా రంగులను అద్ది బతుకమ్మలను పేర్చి బతుకమ్మలను ఒక చోట చేర్చి బతుకమ్మ ఆటపాటలు నిర్వహించి వేడుకలు చేసుకున్నారు అనంతరం బతుకమ్మలను చెరువులకు తరలించి నిమజ్జనం చేశారు ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ మహిళలకు ఎంతో ప్రీతికరమైన బతుకమ్మ వేడుకలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవడం ఆనందకరంగా ఉందన్నారు బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పల్లె దావకానాల ఎంఎల్హెచ్పి లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది,ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవెల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### పేదల ఆత్మగౌరవానికి స్మార్ట్ రేషన్ కార్డులు : సర్పంచ్ సరళ అశోక్ రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 17 (మనం న్యూస్): మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ జిలకపల్లి సరళ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులు పేద కుటుంబాలకు గుర్తింపుతో పాటు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడం, కుటుంబ సభ్యుల పేర్ల నమోదులో ఇబ్బందులు ఎదురవడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తోందన్నారు. భువనగిరి నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్లు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి



నల్లగొండ–అక్టోబర్ 17 (మనం న్యూస్) : నల్గొండ పట్టణ శివారులోని ఎస్ ఎల్ బి సి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి పంచాయతీ కార్యదర్శి చనిపో చనిపోయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. నిడమనూరు మండలం చెన్నారెడ్డిపల్లికి చెందిన శ్రీపతి అంజయ్య(50) చందూరు మండలం పుల్లెంల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ సొంత ఊరు నుండి నల్గొండకు వస్తూ ఎస్ ఎల్ బి సి సమీపంలో రోడ్డుకు పంది ద్విచక్రవానికి అడ్డం రావడంతో దాన్ని ఢీకొని కిందపడి అక్కడికక్కడే మృతి చెందినాడు.

# అన్న ప్రసాద వితరణ అభినందనీయం

**తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

**మేఘ్యా తండాలో ఘనంగా అన్న ప్రసాద వితరణ**



పెన్ పహాడ్ అక్టోబర్ 17 (మనం న్యూస్): భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు శనివారం మండల పరిధిలోని మేఘ్యా తండా గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం వద్ద సర్పంచ్ భూక్య రాజు నాయక్ చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ నిర్వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు సర్పంచ్ దంపతులు ఇలాంటి ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమని కొనియాడారు అన్న ప్రసాద దాతలు భూక్య రాజు నాయక్ చంద్రకళ దంపతులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అందరి సహకారంతో అన్న ప్రసాద వితరణ విజయవంతమైందని తెలిపారు అంతకుముందు కనకదుర్గమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలోసూర్యాపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,వల్దాస్ దేవేందర్,యాట ఉపేందర్, గాయం కరుణాకర్ రెడ్డి, అరవింద్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, ఆంగోతు నాగు, సైదా, బీంజా నాయక్, దస్రు నాయక్, కురవ రెడ్డి, భారత్, అఖి,గోపి, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు,యువకులు, పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మాడుగులపల్లి, అక్టోబర్ 17 (మనం న్యూస్) : నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి తహసీల్దార్ సరోజినీ పావని చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాల సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందడం ద్వారా ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కత్తుల సైదులు, ఆర్ఐ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ కుక్కడం గ్రామ శాఖ అధ్యక్షుడు మునగాల రామచంద్రారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఒంటెపాక వినయ్, లబ్ధిదారు ఒంటెపాక రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతకు బీఆర్ఎస్ నేత కిషన్ నాయక్ ప్రత్యేక పూజలు

**నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

దేవరకొండ అక్టోబర్ 16(మనం న్యూస్) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు దేవరకొండ పట్టణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని 6వ వార్డులో కొలువుదీరిన శ్రీ దుర్గామాత అమ్మవారిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు సమర్పించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొనగా, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పట్టణంలో పండుగ శోభ సంతరించుకుంది. అనంతరం నేనావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. జగన్మాత దుర్గాదేవి కరుణాకటాక్షాలతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సకల ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని కోరుకున్నారు. నాయకులు శ్రీను, గుండాల అంజి తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రాల ప్రారంభం

**అర్హులైన ప్రతి ఓటరు నమోదు చేసుకోవాలి**

**వివిధ గ్రామాల్లో హెల్ప్ లైన్ కేంద్రాలు ప్రారంభం**

ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

పెన్ పహాడ్ అక్టోబర్ 17 (మనం న్యూస్):మండలంలోని వివిధ గ్రామాలైన పెన్ పహాడ్,గాజుల మల్కాపురం,దోసపహాడ్ గ్రామాలలో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలను శనివారం మండల పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు ఆదేశాల మేరకు ఆయా గ్రామ సర్పంచులు ఒగ్గు రవి, నాతాల వెంకటరెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మామిడి వెంకన్న,మండల నాయకులు కొండేటి బిక్షంరెడ్డి లు పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటును నమోదు చేసుకోవాలని వారు తెలిపారు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్లగొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు మండలంలోని అన్ని వార్డుల్లో తక్షణమే నమోదు కేంద్రాలని ప్రారంభించాలన్నారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని,ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు దాన్ని బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు ముఖ్యంగా యువ పట్టభద్రులు తమ ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి రామకృష్ణ రెడ్డి,నాయకులు కుందూరి వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# మహాలక్ష్మి దేవిగా భవానీ మాత దర్శనం

**చండూరు శ్రీ మార్కండేశ్వరాలయంలో నేత్రపర్వంగా శరన్నవరాత్రులు!**

చండూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్) : చండూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం అమ్మవారు భవానీ మాత శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి మెడలోని మణిమాల ( రూపాయల దండ) చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. సర్వాభూషణ భూషితురాలైన శ్రీ మహాలక్ష్మి దేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈరోజు జరిగిన పూజా కార్యక్రమంలో ఏలే శ్రీనివాసులు, సంధ్యా దంపతులు ప్రధాన సేవకులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ భక్తులు అమ్మవారికి నిష్ఠతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**సందడిగా కోలాటాలు, బతుకమ్మ ఆటపాటలు**

పూజా కార్యక్రమాల అనంతరం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. భజన కార్యక్రమాలతో పాటు మహిళల కోలాటాలు, బతుకమ్మ ఆటపాటలు ప్రాంగణమంతా పండుగ వాతావరణాన్ని తలపించాయి. అమ్మవారి నామస్మరణ, దుర్గమ్మ కీర్తనలతో దేవాలయమంతా మార్మోగింది. కార్యక్రమాల అనంతరం మహిళలకు భక్తులకు దేవాలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పద్మశాలి సంఘం నాయకులు యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# తూర్పుపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు

**విజేతలకు రూ.30 వేల ప్రైజ్‌మనీ అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్ నాయక్**

**చింతపల్లి జట్టు ప్రథమ స్థానం.. తూర్పుపల్లి జట్టుకు ద్వితీయ బహుమతి**



దేవరకొండ అక్టోబర్ 16 (మనం న్యూస్) : దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామంలో ఆర్కే యువసైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిసింది. గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ పోటీలకు క్రీడాకారులు, గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన జట్లకు తన సొంతంగా రూ.30,000 ప్రైజ్‌మనీని అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో చింతపల్లి జట్టు అద్భుతమైన ఆటతీరుతో ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, తూర్పుపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీల ఆద్యంతం క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేసిన కిషన్ నాయక్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

**గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలి: కిషన్ నాయక్**

ఈ సందర్భంగా నేనావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే సత్తా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా యువతలోని ప్రతిభ వెలుగులోకి వస్తుందని అన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణకు, సమయపాలనకు, ఐకమత్యానికి దోహదపడతాయని వివరించారు. జయాపజయాలను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని యువతకు సూచించారు. క్రీడల్లో రాణించి తమ గ్రామానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి క్రీడలు, విద్య, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు ప్రోత్సహించడంలో యువజన సంఘాలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు నిర్వాహకులు చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు.

**ఆర్కే యువసైన్యం సభ్యులకు అభినందనలు**

వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించి గ్రామీణ యువతకు క్రీడా వేదిక కల్పించిన ఆర్కే యువసైన్యం సభ్యులను, నిర్వాహకులను కిషన్ నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగించాలని, యువతలో ఐక్యతను పెంపొందిస్తూ క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే యువసైన్యం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలకు ఆహార భద్రత

**బట్టుగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

బీబీనగర్, అక్టోబర్ 18 (మనం న్యూస్): పేదలకు ఆహార భద్రత కల్పించడం, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా బట్టుగూడెం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లతశ్రీశైలం, ఉప సర్పంచ్ మేకల రాములు యాదవ్, పంచాయతీ కార్యదర్శి సత్తిరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి ప్రభాకర్, వార్డు సభ్యులు జక్కుల అందాలు, దుంప శివ, ఆడెపెల్లి జంగయ్య, రాసాల కల్పన బసవరాజ్, దాసమోని రమాదేవి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దుంప శంకర్, నాయకులు సుందరి ఆంజనేయులు గౌడ్, దాసమోని వెంకటేష్, మేకల ఉపేందర్, పల్ల హరినాథ్ రెడ్డి, గెగ్గెలపల్లి సురేందర్ రెడ్డి, కోరె సంజీవ, బాత్క మధు, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిండి ప్రాజెక్టును రద్దు చేయాలి..
# పాలమూరు జిల్లాను కాపాడాలి!

**పాలమూరు ప్రయోజనాల కోసం జడ్చర్లలో ఐక్య కార్యాచరణకు పిలుపు**

**రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుదాం**

**జిల్లా భవిష్యత్తు కోసం పోరాడుదాం!**

**ఈ నెల 19న అంబేద్కర్ కళాభవన్‌లో కీలక సమావేశం**

**జేఏసీ చైర్మన్ ఎన్నిక, కార్యాచరణ రూపకల్పన!**

పాలమూరు , అక్టోబర్ 17 (మనం న్యూస్) : పాలమూరు ప్రయోజనాల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, జిల్లా భవిష్యత్తును ప్రభావితం చేసే సాగునీటి ప్రాజెక్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందనే ఆందోళన నేపథ్యంలో జడ్చర్ల నియోజకవర్గంలో ఐక్య కార్యాచరణకు రంగం సిద్ధమవుతోంది. డిండి ప్రాజెక్టు వల్ల పాలమూరు జిల్లాకు కలిగే నష్టాలపై సమగ్రంగా చర్చించి, జిల్లా ప్రయోజనాల పరిరక్షణ కోసం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కీలక సమావేశానికి పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లా ప్రయోజనాలు, సాగునీటి హక్కులు, భవిష్యత్తు అవసరాల పరిరక్షణ వంటి అంశాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్న తరుణంలో జడ్చర్ల నియోజకవర్గ స్థాయిలో అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ప్రయత్నం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, యువత కలిసి జిల్లా ప్రయోజనాలపై తమ అభిప్రాయాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని సమావేశ నిర్వాహకులు పిలుపునిస్తున్నారు.

**డిండి ప్రాజెక్టుపై చర్చ.. పాలమూరు ప్రయోజనాలే ప్రాధాన్యం!**

డిండి ప్రాజెక్టు అంశం పాలమూరు జిల్లా ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాలని జేఏసీ ఏర్పాటు ఆహ్వాన కమిటీ భావిస్తోంది. సాగునీటి హక్కులు, ప్రాజెక్టుల ద్వారా నీటి పంపిణీ, జిల్లాలోని పెండింగ్ సాగునీటి పథకాల భవిష్యత్తు వంటి అంశాలపై వాస్తవాలు, అధికారిక గణాంకాల ఆధారంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాలమూరు రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడటం, జిల్లాకు కేటాయించిన నీటి హక్కులను పరిరక్షించడం, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రజల ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఐక్యంగా ముందుకు సాగాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలనే డిమాండ్‌తో పాటు, పాలమూరు జిల్లా ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన



# రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య**

**బావాయిపల్లిలో రీ-సర్వే పనులను పరిశీలన**

కొల్లాపూర్, అక్టోబర్ 18 (మనం న్యూస్): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చెన్నయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, సర్వే ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలపై ఆరా తీశారు. భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే పనుల్లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు అయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రీ-సర్వే పనుల కారణంగా ప్రజలకు భూములకు సంబంధించిన వివరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ పరిశీలనలో సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.